క్లుప్తంగా

సన్మానం



వర్ధన్నపేట : స్థానిక ప్రాజెక్టు పరిధిలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖలో పని చేసిన 31 మంది ఉద్యోగ విరమణ చేయగా వారిని సీడీపీఓ డెబోరా ఆధ్వర్యంలో పట్టణంలోని భారతీయ నాటక కళా సమితి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మొత్తం ఏడుగురు టీచర్లు, 24 మంది ఆయాలు ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల సతీ, పతీ సమేతంగా శాలువాలు, పూలమాలతో సత్కరించారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

నల్లబెల్లి : 2010 నుంచి 2016 మధ్య ఆధార్ కార్డు పొందిన ప్రజలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకులా ఆధార్ సేవా శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. పేర్లు, అడ్రస్ మార్పులకు రూ.50, బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవడానికి రూ.100 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ నమోదు ఉచితమని వివరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు వీరయ్య మృతి



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ పోతరాజుపల్లికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు బూర్గుల వీరయ్య (90) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. రజాకార్లకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన వీరయ్య సేవలను పలువురు స్మరించారు. వీరయ్య మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు మంద బాబూరావు, పుస్కుల వీరమల్లు, దొమ్మాటి శంకర్, కుసుంబ రఘుపతి తదితరులు వీరయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో రైతు మృతి



నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం చిన్నతండాకు చెందిన రైతు భూక్య రాములు (55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ఉదయం గుండెపోటుకు గురి కాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే యత్నం చేస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబాన్ని రుద్రగూడెం మాజీ ఉపసర్పంచ్ అజ్మీర తిరుపతి నాయక్ పరామర్శించారు. తొలుత రాములు మృతదేహానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

దుగ్గొండి : కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలైన ఘటన మండలంలోని లక్ష్మిపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముదురుకోళ్ల సాంబలక్ష్మి సాయంత్రం వాకిలి ఊడుస్తుండగా కోతుల గుంపు దాడి చేసింది. సాంబలక్ష్మి చేయి విరిగింది. ఆమెను స్థానికులు చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పోలీసులకు ముగ్గురు మహిళల అప్పగింత

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపులతండాలో మచ్చిక చంద్రమౌళి ఇంటి ఆవరణలోకి వెళ్లిన ప్లాస్టిక్, ఇతర సామగ్రి ఏరుకునే మహిళలను మంగళవారం పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. చంద్రమౌళి ఇంటి ఆవరణలోకి ముగ్గురు మహిళలు ప్లాస్టిక్, ఇతర సామగ్రి ఏరుకునే పేరుతో వెళ్లగా స్థానికులు దొంగలుగా అనుమానించి పోలీసులకు అప్పగించారు. కాగా ఇటీవల హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలంలో ప్లాస్టిక్, ఇతర సామగ్రి ఏరుకునే మహిళలు ఒక యువకుడితో కలిసి తాళం వేసిన ఇంట్లోకి చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకోవడంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

విద్యార్థులకు షూ అందజేత



నెక్కొండ : మండలంలోని పనికర ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 12 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సుకన్య చేతుల మీదుగా ఉపాధ్యాయురాలు అరుణ మంగళవారం షూ పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం సుకన్య మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయురాలు అరుణ సొంత డబ్బుతో విద్యార్థులకు షూ కొనుగోలు చేసి అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొమురవెల్లి వెంకటేశ్వర్లు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

- మండలంలో 98 శాతం నమోదు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో స్వీకరించిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే మండలంలో 98 శాతం పూర్తి అయ్యింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సర్వేలో ఎదురైన సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం చర్చనీయాంశంగా మారింది.

29 పంచాయతీలు.. 11 వేల 870 దరఖాస్తులు

మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 11 వేల 870 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను గుర్తించేందుకు గత నెల 11న ప్రారంభించగా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి 500 చొప్పున దరఖాస్తులు అందాయి. పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి ఫొటోలతోపాటు వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మండలంలో మొత్తం 11 వేల 621 దరఖాస్తుల సర్వే పూర్తి కాగా 98 శాతంగా నమోదైంది. వలస వెళ్లిన, అనర్హులు, కొందరు స్పందించని కారణంతో 249 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది. సర్వే పూర్తి కావడంతో ఇళ్ల మంజూరీ కోసం పేదలు ఎదురు చూస్తున్నారు.

క్రాస్ చెక్ చేస్తున్నాం



ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వివరాలను గ్రామాల వారీగా క్రాస్ చెక్ చేస్తున్నాం. సర్వే పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం. తదుపరి కఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

– నర్సింహమూర్తి, ఎంపీడీఓ

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దేవేందర్



ధర్నా చేస్తున్న దేవేందర్, నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో మృతి చెందిన జయముఖి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అవినాశ్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్చురీ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. పట్టణంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఉన్న ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న అవినాశ్ హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్లే విద్యుదాఘాతానికి గురయ్యాడని తెలిపారు. పోలీసులు, ప్రభుత్వం హాస్టల్ నిర్వాహకులతోపాటు వార్డెన్ నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబానికి పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏబీవీపీ నాయకులు రాకేశ్, శశి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు

చెన్నారావుపేట : మండలంలోని ముగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి కొండల్‌వాడి అవినాశ్‌రెడ్డి మృతి నేపథ్యంలో ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థి తండ్రి దత్తారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచండి

- రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వాసు



వినతిపత్రం ఇస్తున్న నవీన్, నాయకులు

రాయపర్తి : ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అనుసరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, వాసు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే బీసీల రిజర్వేషన్ పెంచుతామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లు కేటాయించాలని, ఇతర హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్, మండల అధ్యక్షుడు మంచాల సుమన్, నాయకులు గోరంట్ల ప్రభాకర్, నిమ్మల అనిల్, జక్కుల సందీప్, రాసాల రాకేశ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో యాదవుల హక్కుల సాధన

- సమితి జాతీయ అధ్యక్షుడు రాములు



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

నర్సంపేట : ఐక్యతతో ఉంటేనే యాదవుల హక్కులను సాధించుకోగలమని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు స్పష్టం చేశారు. యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో యాదవులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఐక్యత లేకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కులస్తులకు సమితి అండగా ఉంటుందన్నారు. యాదవ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్, గొల్ల కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు మాట్లాడుతూ జనాభా మేరకు రాజకీయ వాటా దక్కాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఆబోతు అశోక్, నియోజకవర్గ కన్వీనర్, కోడి అశోక్, జేఏసీ నాయకులు రాజయ్య, రమేశ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రేషన్'లో 14 రకాల సరుకులు ఇవ్వాలి



సంగెం : వినతిపత్రం ఇస్తున్న సంధ్య, నాయకులు

సంగెం/గీసుకొండ : రేషన్ షాపుల ద్వారా పేదలకు 14 రకాల సరుకులు అందించాలని కోరుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య ఆధ్వర్యంలో సంగెం, గీసుకొండ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ సంగెం మండల కన్వీనర్ రౌతు రేణుక, నాయకులు పెండ్యాల లలిత, స్వప్న, యమున, వీరలక్ష్మి, ప్రసన్న, సరిత, రమ, కోమల, రాజమ్మ, కృష్ణవేణి, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి తోటలో క్షేత్ర ప్రదర్శన

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన రైతు తోటకూరి రాజు సాగు చేసిన మిర్చి తోటలో మంగళవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన రైతులు సాగు విధానం, విత్తన రకంపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి సాధించిన క్రమంలో రాజును విత్తన కంపెనీల ప్రతినిధులు, డీలర్లు సన్మానించారు. కార్యక్రమంలో తిమ్మంపేట చిల్లీ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ రైతు ఉత్పత్తిదారుల సంఘం బాధ్యులు నరహరి రాజ్‌కుమార్‌రెడ్డి, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్ల యాకయ్య, ఉపాధ్యక్షుడిగా దబ్బెట నరేశ్, కార్యదర్శిగా దబ్బెట యాలాద్రి, కోశాధికారిగా జీడి భాస్కర్, సలహాదార్లుగా దబ్బెట నర్సయ్య, బొమ్మెర రాజు, గట్టయ్య, ప్రసాద్, నాగరాజు, డప్పు కళాకారుల కమిటీ అధ్యక్షుడిగా చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా తాళ్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శులుగా తాళ్ల యాకయ్య, యాకూబ్, కోశాధికారిగా దబ్బెట యాకయ్య ఎన్నికయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చెన్నారావుపేట : స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈఓ సరళతో కలిసి డీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు అంగోతు భద్రయ్య మంగళవారం ఆవిష్కరించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో సైతం ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మానుపాటి పాపమ్మ, డీటీఎఫ్ మండల శాఖ సభ్యులు కప్పల కొముర‌య్య, పడిదం కట్టస్వామి, ఉమాశంకర్, యాకయ్య, స్వామి, వెంకటేశ్వర్లు, మంజుల రాణి, తారాసింగ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో బీఆర్‌ఎస్ నాయకుడు రంగు ఎల్లగౌడ్ మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని కుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మెర వీరస్వామి, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బాషబోయిన సుధాకర్, బొమ్మెర వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో సమర్థత చాటండి



దుగ్గొండి : విధినిర్వహణలో ఆశాకార్యకర్తలు సమర్థత చాటాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో చిన్నారులకు, గర్భిణులకు వ్యాక్సిన్ వేయించడంలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. గ్రామాల వారీగా టార్గెట్‌లను నూరు శాతం పూర్తి చేయాలని తెలిపారు. కొత్తగా వైరస్ విజృంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్, సిబ్బంది సాంబయ్య, సలోమి, సబిత, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బోల్తా పడి వలస కూలీలకు గాయాలు

ఖానాపురం : వలస కూలీలతో వెళ్తున్న తుఫాన్ వాహనం బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న 18 మంది కూలీలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని చిలుకమ్మనగర్ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన 18 మంది కూలీలు తుఫాన్ వాహనంలో ఖమ్మం జిల్లాలో మిర్చి ఏరడానికి వెళ్తుండగా చిలుకమ్మనగర్ శివారులోకి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు కాగా 16 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో తాళం వేసి ఇంట్లో చోరీ జరిగింది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లెపు వెంకటనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఊరికెళ్లాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న తులం మూడు గ్రాముల బంగారం, రెండు జతల చెవికమ్మలు, మాటీలు, 32 తులాల వెండి, పట్టాగొలుసులు, రూ.15 వేల నగదు అపహరించారు. తాళం పగులగొట్టి, తలుపులు తీసి ఉండటాన్ని స్థానికులు గమనించి వెంకటనారాయణకు సమాచారం అందించి ఇంట్లో పరిశీలించగా చోరీ వెలుగులోకి వచ్చింది. సీఐ సాయిరమణ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలల జన్మదిన వేడుక



గీసుకొండ : మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిలో బాలవికాస ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న 13 మంది పేద బాలల జన్మదిన వేడుకను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్ బాలలతో కేక్ కట్ చేయించి మాట్లాడారు. జిల్లాలోని ఆరు మండలాలకు చెందిన 23 గ్రామాల బాల వికాస మహిళలు పేద బాలలను దత్తత తీసుకోవడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి లత, ఎఫ్‌ఏ రమ్య, గూడ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేటకు చెందిన అమీనాబాద్ మోడల్ స్కూల్ అమ్మ ఆదర్శ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మణ్‌మూర్తి (49) పక్షవాతానికి గురై పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి పెద్ద కూతురు బ్రాహ్మణి తలకొరివి పెట్టింది. మృతుడికి కొడుకులు లేకపోవడంతో కూతురు తలకొరివి పెట్టగా గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి బీఆర్‌ఎస్ నాయకుడు బాల్నె వెంకన్న, మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ సర్పంచ్ అనుముల కుమారస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతం మహేందర్, సొసైటీ వైస్ చైర్మన్ పెండ్లి మల్లయ్య, యూత్ అధ్యక్షుడు పెండ్లి రాజశేఖర్, నాయకులు తదితరులు పరామర్శించారు.

అన్ని మతాలకు ప్రాధాన్యం



ఎమ్మెల్యేకు గార్మీ, వేంకటేశ్వరస్వామి ప్రతిమలను బహూకరిస్తున్న మసూద్, తదితరులు

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలకు సమప్రాధాన్యం ఇస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మసూద్ బేగ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలకు ఎమ్మెల్యే మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పుష్పాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం మైనార్టీ నాయకులు మసూద్ బేగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయూబ్ ఖాన్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి గ్యార్మీ షరీఫ్, వెంకటేశ్వర స్వామి, మహాగణపతి ప్రతిమలను బహూకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి నుంచి పర్శనాయక్‌తండా, నారాయణ తండాకు వరకు రూ.2.50 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను, పర్శనాయక్‌తండాలో రూ.3.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్ నాయక్, పట్టణ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

- సీఐ శ్రీనివాసరావు



రోడ్డు పక్కన చెట్లును తొలగిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అవగాహన, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానిక సీఐ శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు నుంచి వర్ధన్నపేట డీసీ తండా వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను మంగళవారం జేసీబీతో పోలీసులు తొలగింపజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు చాలా వరకు వాహన చోదకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు నడిపే వ్యక్తులు సీట్ బెల్టు పెట్టుకోవాలని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు కీలకం

- ఎంఈఓ సరళ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సరళ

చెన్నారావుపేట : పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం కీలకమని ఎంఈఓ బైరి సరళ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రిజిస్టర్లను, విద్యాలయ పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులు ఉత్తమ గ్రేడింగ్ సాధించే దిశగా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి మెట్టుపల్లి జ్యోతి, స్థానిక స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాపమ్మ, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, షాహీనా, రజని, యశోద, కమలమ్మ, సుమలత, స్వప్న, రజిత, కవిత, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ హమాలీలపై నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రవి

వర్ధన్నపేట : సివిల్ సప్లయీస్ హమాలీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ మండల కార్యదర్శి ఆరెల్లి రవి విమర్శించారు. పట్టణంలోని హమాలీల సమ్మె మంగళవారం ఏడో రోజుకు చేరుకోగా సీపీఐ మండల కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. 2020 జనవరిలో హమాలీలతో చేసుకున్న ఒప్పందానికి అనుగుణంగా కూలీ రేట్లు పెంచాల్సి ఉందన్నారు. రెండేళ్లకోసారి కూడా పెంచకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం హమాలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, ఆరోగ్యం, నవాబ్, భిక్షపతి, సారయ్య, సాయిలు, పుష్ప, సుజాత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఫీజుల పేరుతో దోపిడీ

- సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీధర్

నర్సంపేట : పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసేందుకు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అన్నారు. పట్టణంలో ఇప్ప సతీశ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో శానికి శ్రీధర్ హాజరై మాట్లాడారు. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెషెంట్ల నుంచి టెస్టులు, అడ్మిషన్ పేరుతో డబ్బులు దండుకుంటున్నారని చెప్పారు. ఓపీ, అనెస్తీలషియా ఫీజులు భారీగా పెంచాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు కందికొండ రాజు, ఫరీదా, వజ్జంతి విజయ, బిట్ర స్వప్న, ఉదయగిరి నాగమణి, నర్సింహరాములు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల పెంపును విరమించుకోవాలి

పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ, అనెస్తీషియా ఫీజుల పెంపును విరమించుకోవాలని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు ఐఎంఏ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశమై ఓపీ, అనెస్తీషియా ఫీజులను భారీగా పెంచినట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. వైద్యులు పునరాలోచించి ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి, జిల్లా నాయకులు భూమా అశోక్, రాంచందర్, బర్ల గౌరయ్య, తదితరులు పాల్గొన్నారు.